అందుబాటులో మెరిట్ జాబితా

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: కేజీబీవీల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా సమగ్రశిక్షా అభియాన్ కార్యాలయంలో ప్రచురించినట్లు ఏపీసీ సీహెచ్ ఉషారాణి ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు రాతపూర్వకంగా శనివారం సాయంత్రంలోగా తెలియజేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న కమిషన్ ఛైర్‌పర్సన్ పద్మావతి చిత్రంలో అధికారిణులు

వసతి గృహ విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టండి


నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ బి.పద్మావతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంక్షేమశాఖ, వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 2000 సంవత్సరంలో పిల్లల సంరక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారని, క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలు అనేక హింసలకు, మానసిక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండే పిల్లలకు పాఠశాలల్లో పాఠ్యాంశాలతో పాటు బాలల చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసులు, ప్రమీల, ప్రసన్న, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

ముసురు కాలం.. మారాలి వైద్యం!

వైద్యశాలల్లో అరకొర సేవలతో అవస్థలు ● ముందస్తు ప్రణాళికతోనే ఉపశమనం

వరుస తుఫాన్లు.. వాటి కారణంగా కురుస్తున్న వర్షాలు.. అనూహ్య వాతావరణ మార్పులతో ప్రజలను అనేక అనారోగ్య సమస్యలు వెన్నాడుతున్నాయి. మున్ముందు వర్షా కాలం ఉండనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో.. జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో అయినా.. సౌకర్యాలు, సేవల మెరుగు దిశగా యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సమగ్ర ప్రణాళికతో.. ముందస్తు చర్యలు చేపడితేనే.. పేద, మధ్యతరగతి వర్గాలకు ఆసుపత్రుల్లో ఊరట లభించేది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్), ఆత్మకూరు, ఉదయగిరి, కావలి,



జిల్లాలో ఒక వైద్యశాలలోనే చిన్నపిల్లల వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. త్వరలోనే నియామకం జరుగుతుంది. ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలలో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. మందులు, యంత్రాల కొరత లేదు. – డాక్టర్ రమేష్‌నాథ్, డీసీహెచ్ఎస్

ఓపీ వేళల్లోనే ఎక్స్‌రే..

కావలి పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో ఎక్స్‌రే విభాగం ఓపీ వేళల్లోనే పనిచేస్తుంది. ప్రమాద బాధితులు, ఇతర అత్యవసర సందర్భాల్లో.. సమాచారం అందగానే ఎక్స్‌రే, ల్యాబ్ సిబ్బంది అందుబాటులోకి రావాలి. అలా ఎప్పుడూ వచ్చిన దాఖలాలు లేవు. ఎక్స్‌రే సిబ్బంది నెల్లూరులో నివాసం ఉంటుండటంతో.. ఆన్‌కాల్ డ్యూటీ విధానం అమలు కావడం లేదు. ఇక్కడ ట్రామాకేర్ విధానం అందుబాటులోకి రావాల్సిన ఆవశ్యకత ఉంది.



ఎక్స్‌రే గది

నెల్లూరులో ఉక్కపోతే..



జిల్లా ప్రభుత్వాసుపత్రి

నెల్లూరు జీజీహెచ్‌లో రోగులకు వసతులు మెరుగుపరచాల్సి ఉంది. ఏసీలు పని చేయడం లేదు. ఫ్యాన్లు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. రోగులు తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఆసుపత్రిలో ఏడు ఆపరేషన్ థియేటర్లు ఉండగా.. ఏసీలు పనిచేయక ఒక్కోసారి శస్త్రచికిత్సలకూ విఘాతం కలుగుతోంది. ఐసీయూలోనూ ఇదే పరిస్థితి. కొవిడ్ ఐసీయూ సెంట్రల్ ఏసీ తప్ప.. మిగిలిన వార్డుల్లో రోగుల బాధలు వర్ణనాతీతం.

వైద్యులు లేక.. సేవలు అందక..

ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 50 పడకలు ఉన్నా.. ఆ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ఏళ్లుగా చిన్నపిల్లల వైద్య నిపుణుడి పోస్టు ఖాళీగా ఉండగా- చికిత్స అవసరమైన వారిని వింజమూరు, ఆత్మకూరు, నెల్లూరు వంటి దూర ప్రాంతాలకు తీసుకువెళ్లాల్సి వస్తోంది. వైద్యశాల ఆవరణలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం అలంకారప్రాయంగా మారింది. జనరల్ సర్జన్, ఈఎన్‌టీ వైద్యుల పోస్టులూ భర్తీ కాలేదు.



అలంకారప్రాయంగా నవజాత శిశు సంరక్షణ కేంద్రం

ఆక్సిజన్ ప్లాంట్‌కు సాంకేతిక సమస్య

కొవిడ్ సమయంలో సినీ నటుడు సోనూసూద్ ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు అందించిన ఆక్సిజన్ ప్లాంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. గతంలో సమస్యలు తలెత్తితే వారే చూసేవారు. జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం వారి కోసం ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ నిపుణులతో పరిష్కారానికి యత్నిస్తున్నారు. ఇక్కడ మరో ప్లాంట్ ఉండటం ఉపశమనం కలిగిస్తోంది.



సోనూసూద్ అందజేసిన ఆక్సిజన్ ప్లాంట్

పొంచి ఉన్న ముప్పు


కందుకూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుతోంది. 25 ఏళ్ల కిందట కట్టిన భవనాలు కావడంతో అనేక చోట్ల పెచ్చులూడటంతో పాటు నీరు ఒరుస్తోంది. డెంటల్, చిన్నపిల్లల ఓపీ గదులు, ఆపరేషన్ థియేటర్ పక్కన విశ్రాంతి గది, సూపరింటెండెంట్ గది, మొదటి అంతస్తులో కారిడార్ తదితర ప్రాంతాల్లో పెచ్చులూడాయి. ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థ చక్కదిద్దాల్సి ఉంది.



ఆసుపత్రి కారిడార్‌లో రెండు రోజుల క్రితం ఊడిన స్లాబు

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర విద్యుత్తు

వందశాతం రాయితీతో పరికరాలు




నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చేవారికి పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ లిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ఆర్థికసాయం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.

ఇద్దరికీ లాభమే... సౌర పలకలపై పెట్టుబడితో యంత్రాంగంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా భవిష్యత్తులో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌పై సమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. సోలార్ ద్వారా అందించగలిగితే ఆ సొమ్ము ఆదా అయినట్టే. లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తున్నారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది. ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయిందని జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.విజయన్ తెలిపారు.

వాత్సల్యం.. ఉపశమనం

రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు ● 591 మందికి సాయం అందే అవకాశం



విధి వంచితులైన చిన్నారులు, బాలలను ఆదుకునేందుకు ఉద్దేశించిన మిషన్ వాత్సల్య పథకం కింద రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు మొదలైంది. గత వైకాపా ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక నుంచి సాయం అందించడం వరకు తీవ్ర నిర్లక్ష్యం చూపగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసి.. అభాగ్యుల కళ్లలో ఆనందం నింపింది. ఇప్పుడు రెండో విడత దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది.

దుత్తలూరు, న్యూస్‌టుడే

జిల్లాలో 38 మండలాలు ఉండగా- 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. తొలి విడతలో 497 మందిని మిషన్ వాత్సల్య కింద ఎంపిక చేసినా.. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో వారికి సకాలంలో సాయం అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. దీనిపై ప్రత్యేక దృష్టిసారించింది. మొదటి విడతలో గుర్తించిన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు జిల్లా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఈ పథకం కింద ఈసారి 591 మందికి సాయం అందించనున్నట్లు సమాచారం. ఆ మేరకు అధికారులు ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అర్హులు ఎవరంటే...

- 2025 మార్చి 31 నాటికి 18 ఏళ్లలోపు వారు
- తల్లిదండ్రులను కోల్పోయిన వారు
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దంపతుల పిల్లలు
- బాలల న్యాయచట్టం-2015 ప్రకారం నిరాదరణకు గురైనవారు
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 72వేలు, పట్టణాల్లో రూ. 96వేలు మించరాదు

ఎవరిని సంప్రదించాలంటే...

అర్హులు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలి. దరఖాస్తుతో పాటు చిన్నారుల జనన, ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలు, తల్లిదండ్రులు.. లేదంటే, సంరక్షకుల ఆధార్, రేషన్ కార్డు నకలు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఇతర పత్రాలతో.. గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి. ఎంపికలో ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న వారికి ప్రాధాన్యమిస్తారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల రక్షణ అధికారి సురేష్

ప్రక్రియ ప్రారంభించాం

జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాం. ఇప్పటికే ప్రాజెక్టుల వారీగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. మొత్తం 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 591 మందికి రెండో విడతలో సాయం అందించనున్నాం. పరిశీలన అనంతరం తుది జాబితా ప్రకటిస్తాం.

– సురేష్, జిల్లా బాలల రక్షణ అధికారి

సాగు జలం.. సాగితే బలం

ఐఏబీ సమావేశం ఊసెత్తని అధికారులు

సోమశిలలో 62.786 టీఎంసీల నీరుంది. సాగుకు విడుదల నిమిత్తం ఐఏబీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో? ఎప్పుడు నీటిని విడుదల చేస్తారో? నార్లకు ముందుగా విడుదల చేస్తే బాగుంటుంది.

– ఆయకట్టు రైతుల ఎదురుచూపు

ఆయకట్టు అవసరాల కంటే నిల్వ తక్కువగా ఉన్నప్పుడే సమావేశం అవసరం. ఇప్పుడు పుష్కలంగా ఉంది. సాగు నీటి విడుదలకు ఎప్పుడైనా సిద్ధమే.. త్వరలో చేసే అవకాశం ఉంది.

– జలవనరులశాఖ అధికారుల మాట

ఆత్మకూరు, న్యూస్‌టుడే

జిల్లాలోని రెండు ప్రధాన జలాశయాల్లో 102 టీఎంసీలు ఉండగా- సోమశిలలో 62.786 టీఎంసీల నిల్వ ఉంది. కండలేరు 40 టీఎంసీలకు చేరింది. మరోవైపు జలాశయానికి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. 26,411 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ, కావలి కాలువల పరిధిలో సమస్యలు ఉన్నా.. నారుమళ్లకు ఇప్పుడే నీరు విడుదల చేస్తే బాగుంటుందని రైతులు అంటున్నారు. అక్టోబరు చివరి వారం వచ్చేసింది. ఇప్పుడు నార్లు పోస్తే.. మొదటి పంటలో అధిక దిగుబడికి వాతావరణం తోడ్పడుతుందనేది వారి ఆశ. వాస్తవానికి డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలు, సాగునీటి చెరువులకు తరలించే యోచనతో.. ఈ సీజన్‌లో ముందుగానే నీరు విడుదల చేశారు. తుపాను వర్షాల నేపథ్యంలో చెరువులు, కాలువల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని.. ఆపేశారు. వరద కొనసాగుతుండటంతో.. కండలేరు కాలువకు పది వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ఉత్తర కాలువకు 300 క్యూసెక్కుల విడుదల మొదలైంది. ఇక డెల్టా, కావలి, కనుపూరు కాలువలు, దక్షిణ కాలువకు మాత్రమే చేయాల్సి ఉంది. డిసెంబరు మొదటి వారం వరకు జలాశయానికి వరద కొనసాగుతుంది. జిల్లాలోనూ వర్షాలు పడతాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. ఇప్పుడే నీటిని వదిలితే.. జలాశయం నిల్వ వినియోగం తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు.



జలాశయంలో నీటి నిల్వ

ఎప్పుడైనా సిద్ధమే...

జలాశయంలో ఇప్పటికే ఆయకట్టు అవసరాలు పోను.. పది టీఎంసీలపైనే నిల్వ ఉంది. తక్కువ నిల్వ ఉన్నప్పుడు ఐఏబీ అవసరం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పుడైనా విడుదలకు సిద్ధంగానే ఉన్నాం. – దేశ్‌నాయక్, ఎస్ఈ, జలవనరులశాఖ

ఆయకట్టు ఇలా..

పంపిణీ వ్యవస్థ	ఆయకట్టు	అభివృద్ధి
	(ఎకరాల్లో)	
పెన్నార్ డెల్టా	2.47లక్షలు	2,47,000
ఉత్తర కాలువ	1.41 లక్షలు	98,000
దక్షిణ కాలువ	41వేలు	35,500
కావలి కాలువ	75వేలు	74,000
కనుపూరు కాలువ	61వేలు	61,000

- సోమశిల ఆధారంగా జిల్లాలో 5,84,500 ఎకరాల ఆయకట్టు ఉండగా- 5,15,500 ఎకరాలే ప్రస్తుతం సాగులో ఉంది. డెల్టా ఉత్తర, దక్షిణ, కావలి, కనుపూరు కాలువల పరిధిలో ఈ ఆయకట్టు ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రత్యేక చర్యలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: పలు పదవుల్లో పనిచేసిన తనకు జిల్లాపై పట్టు ఉందని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు నూతన డీఈవో బాలాజీరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయనను బదిలీ అయిన డీఈవో రామారావు పూలబొకేతో స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో జిల్లాను ముందంజలో ఉంచుతానని తెలిపారు. ఆయన్ని ఉప విద్యాశాఖాధికారులు ప్రసన్నలక్ష్మి, రఘురామ్, కార్యాలయ సూపరింటెండెంట్లు, ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. డీఈవోను ఏపీటీఎఫ్ (1938) యూనియన్ నాయకులు అభినందించి.. ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, రియాజ్, జుల్ఫికర్‌అలీ, మురళీకృష్ణ, రాజశేఖర్ గుప్తా, వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు... జటాయువు సిద్ధం



నెల్లూరు నగరపాలక సంస్థలో అయిదేళ్ల తర్వాత జటాయువు యంత్రం సేవలందించేందుకు సిద్ధమైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో.. అయిదేళ్లు ఈ యంత్రాలను నిరుపయోగంగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మతులు చేపట్టారు. ఆ క్రమంలోనే ఓ యంత్రాన్ని సిద్ధం చేసి.. కార్యాలయం ఆవరణలో ఉంచారు. దీని ద్వారా నగరంలో కాగితాలు, ఇతర వ్యర్థాలను శుభ్రం చేయనున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

అండర్ బిడ్జిలో మురుగు వెతలు



నెల్లూరు విజయ మహల్ గేటు అండర్ బిడ్జిలో మురుగునీరు చేరింది. రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచూ మురుగునీరు చేరుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు మురుగునీటిని తొలగిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

ఎస్సీ కార్పొరేషన్‌లో... ఉద్యోగులకు రివర్షన్!

అక్రమ ఉద్యోగోన్నతులపై లోకాయుక్తకు ఫిర్యాదు నేపథ్యం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగుల అక్రమ ఉద్యోగోన్నతులు, నిధుల దుర్వినియోగం తదితరాలపై రేగిన వివాదం చినికి చినికి గాలివానగా మారింది. జూనియర్ అసిస్టెంట్ భారతి, టైపిస్టు రఫీ అహ్మదలను రివర్షన్ చేసి.. క్లాస్ ఫోర్ ఉద్యోగులుగా పంపాలని తాజాగా కార్పొరేషన్ ఎండీ జిల్లా ఉన్నతాధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి కారణమైన అప్పటి ఈడీ, ఈవోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ పరిణామాలపై ప్రస్తుత ఇన్‌ఛార్జి ఈడీ డాక్టర్ నిర్మలాదేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. అక్రమ ఉద్యోగోన్నతులపై ఇది వరకే విచారణ జరిగిందని, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్‌కు సైతం నివేదిక ఇచ్చామని, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం లోకాయుక్తకు నివేదిక పంపుతామన్నారు.



జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నాటి ఈడీ, ఈవోలకు షోకాజ్ నోటీసులు

ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమ ఉద్యోగోన్నతులపై నగరానికి చెందిన లాయర్ పాముల హరిప్రసాద్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన లోకాయుక్త.. కార్పొరేషన్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబును నివేదిక కోరింది. విచారణ చేపట్టిన కన్నబాబు.. జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో అవకతవకలు, క్లాస్ ఫోర్ ఉద్యోగులు అక్రమంగా ఉద్యోగోన్నతులు పొందడం నిజమేనని నివేదిక సమర్పించారు. దాంతో రాష్ట్ర అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అక్రమంగా ఉద్యోగోన్నతులు పొందిన ఉద్యోగులను రివర్షన్ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. దీనికి నాటి ఈడీ సారయ్య, ఈవో సెల్విని కారకులుగా చేస్తూ.. షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈవో సెల్వీ ఇప్పటికే మరో విషయంలో సస్పెండ్ అయ్యారు. ఈ పరిణామాలు మరెంతకు దారి తీస్తాయోనని.. అధికారులు, ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

నెల్లూరు(జడ్పీ) : జడ్పీ పాలకవర్గంలో ప్రధానమైన జడ్పీ ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన, ఇన్‌ఛార్జి సీఈవో మోహన్‌రావు ఆధ్వర్యంలో సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ, గృహ నిర్మాణశాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, సంక్షేమ తదితర శాఖల ప్రగతి, వాటి పరిధిలో పలు లోపాలపై చర్చ జరగనుంది.

యువతిపై నలుగురి అత్యాచారం

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో ఘోరం జరిగింది. ఓ యువతిపై నలుగురు యువకులు ఒకరికి తెలియకుండా ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై ఈ నెల 22న పోలీసులు కేసు నమోదు చేయగా- శుక్రవారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు గ్రామీణంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి(19) ప్రతి ఆదివారం చర్చికి వెళుతుండగా- అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ఇంటికి వెళ్లే వరకు వచ్చింది. ఆ క్రమంలో ఆ ఇంట్లో ఉంటున్న అన్నదమ్ములు, స్నేహితులు నలుగురు యువతితో పరిచయం పెంచుకుని ఒకరికి తెలియకుండా ఒకరు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. కొంత కాలంగా ఈ వ్యవహారం జరుగుతున్నా.. విషయం బయటపడలేదు. యువతి శరీరంలో మార్పులను గమనించిన బంధువులు నిలదీశారు. అత్యాచారం జరిగినట్లు గుర్తించి నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం శుక్రవారం నిందితులు నిఖిల్, సునీల్, సన్నీ, నవీన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాపాడే యత్నం... ఈ దుర్ఘటనను పోలీసులు గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిచ్చింది. నిందితులను కాపాడేందుకే అలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే ఈ నెల 22న కేసు నమోదు చేసినా.. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడ్డారనే విమర్శలు నెలకొన్నాయి. చివరకు సిబ్బందికి కూడా విషయం తెలియకుండా.. బయటకు వస్తే చర్యలు తప్పవని సూచించడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్పెషల్ బ్రాంచి పోలీసులు సైతం ఈ విషయం తమ దృష్టికి రాలేదని చెబుతుండటం గమనార్హం.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,513
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 60,104
వెండి గ్రాము :	రూ. 101.30

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	126
రిటైల్	148
లేయర్	110
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	132
లేయర్	110
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	187

ఎలుగుబంట్ల దాడిలో గాయాలు



మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో తాత్కాలిక సిబ్బందిగా పనిచేస్తున్న **రోశయ్య**పై శుక్రవారం ఎలుగు బంట్లు దాడి చేయడంతో రోశయ్య చేతికి గాయమైంది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు... పెట్రోలింగ్ నిర్వహించేందుకు అయిదుగురు సిబ్బంది అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. అక్కడ వీరు ఒకరి వెనుక ఒకరూ నడుచుకుంటూ వెళుతుండగా పొదలమాటున ఉన్న రెండు ఎలుగుబంట్లు చివరగా వెళుతున్న రోశయ్యపై ఒక్కసారిగా అప్రమత్తమైన మిగిలిన సిబ్బంది కేకలు వేసి వాటిని తరిమికొట్టి రోశయ్యను కాపాడారు. చికిత్స నిమిత్తం మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

అంకితభావంతో మన్నన

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. మొత్తం 15 సిబ్బంది తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది కోరుకున్న ప్రాంతానికే బదిలీ చేస్తున్నామన్నారు. సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, అనధికారికంగా గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు నిధుల మంజూరు

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సొంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ టి.వేణుగోపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం కింద 56,074 గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-వై.ఎస్.ఆర్. (గ్రామీణ) 2021-22 పథకం ద్వారా 13,037 గృహాలు కేటాయించగా.. వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న గృహాలకు సెప్టెంబర్ 30 వరకు 2594 మంది లబ్ధిదారులకు రూ. 6.43 కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీంతోపాటు జిల్లాలో గృహనిర్మాణ సంస్థ గోదాముల్లో సిమెంటు, స్టీలు, బిల్డింగ్ మెటీరియల్ అందుబాటులో ఉందని వివరించారు. లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి ఇళ్లను పూర్తి చేసుకోవాలని కోరారు.

క్రీడా పోలీస్

జాతీయ స్థాయిలో రాణింపు



రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

వృత్తి పోలీస్ అయినా ప్రవృత్తిగా క్రీడలు ఎంచుకున్నారు. ఒకవైపు ఉద్యోగానికి న్యాయం చేస్తూ.. మరోవైపు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఈ ఏడాది జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా పోలీసులకు 9వ ఆలిండియా పోలీసు జుడో క్లస్టర్ పోటీలు అసోంలో జరిగాయి. వీటిలో జిల్లాకు చెందిన పోలీసులు చరణ్ తేజ, రాజశేఖర్, శ్రావణి బంగారం, వెండి, కాంస్య పతకాలు సాధించారు. శుక్రవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ వారిని అభినందించారు.

- న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం), కందుకూరు గ్రామీణ

పెన్‌కాక్ సిలాట్‌లో తేజసం



పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో నెల్లూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చరణ్ తేజ బంగారు పతకం సాధించారు. చిన్ననాటి నుంచే క్రీడలంటే ఇష్టం. తైక్వాండోలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 2021 నుంచి పెన్‌కాక్ సిలాట్‌లో శిక్షణ తీసుకుని అందులోనూ పతకాలు సాధిస్తున్నారు. నెల్లూరు కిసాన్ నగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మురళీధర్ కుమారుడు చరణ్ తేజ.. ఏఆర్‌లోనే కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఈయన.. పోలీసు క్రీడల్లో ఇప్పటి వరకు మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2023లో నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోలీసు క్రీడల్లో జిల్లా నుంచి పాల్గొన్నారు. ఈ ఏడాదిలో దిల్లీలో జరిగిన పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ చూపారు. తాజాగా అసోంలో జరిగిన పోలీసు క్రీడల్లో ప్రథమ బహుమతి సాధించారు.

ఆట ఏదైనా రాజశేఖర్ ప్రతిభ

లింగసముద్రానికి చెందిన రైతు మస్తాన్ రెడ్డి, రత్నమ్మ కుమారుడు ఎం.రాజశేఖర్. ప్రస్తుతం కందుకూరు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన 2009లో పోలీసు శాఖలో చేరారు. అంతకు ముందు తైక్వాండోలో రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. 2017లో దిల్లీలో జరిగిన ఆలిండియా పోలీసు క్రీడల్లో జిల్లా నుంచి పాల్గొన్నారు. 2019లో దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉషూలో ప్రాతినిధ్యం వహించారు. తాజాగా అసోంలో జరిగిన ఆలిండియా పోలీసు క్రీడల్లో పెన్‌కాక్ సిలాట్ అండర్-95 కేజీల విభాగంలో వెండి పతకం సాధించారు.

కరాటే శ్రావణి



పోలీసు ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రావణి.. కరాటేలోని ఫైట్ విభాగంలో కాంస్య పతకం సాధించి అబ్బురపరిచారు. చిన్ననాటి నుంచి క్రీడలు ఇష్టమున్న ఆమె.. పోలీసు శాఖలో 2018లో చేరారు. వాలీబాల్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకున్న ఆమె.. పోలీసుశాఖలో వచ్చిన కరాటేలో రాణిస్తున్నారు. తండ్రి తిరుపతి కావలి తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఏగా పని చేస్తున్నారు. 2020 నుంచి కరాటేలో శిక్షణ తీసుకున్న ఆమె.. 2022లో దిల్లీలో జరిగిన ఆలిండియా పోలీసు జుడో క్లస్టర్ పోటీల్లో కరాటే ఫైట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. తాజాగా అసోంలో జరిగిన ఆలిండియా పోలీసు క్రీడా పోటీల్లో కరాటేలోని ఫైట్ విభాగంలో కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. గతంలోనూ వాలీబాల్ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు.



కందుకూరులో అర్బన్ మార్కెట్‌లో ఉత్పత్తులు పరిశీలిస్తున్న మెప్మా పీడీ రవీంద్ర

వివాదాలపై కఠిన చర్యలు

కావలి, కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పొదుపు గ్రూపుల్లో స్లమ్, పట్టణ స్థాయిల మధ్య ఎలాంటి వివాదాలు ఏర్పడిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని మెప్మా పీడీ బీ.రవీంద్ర అన్నారు. కావలిలోని మెప్మా కార్యాలయాన్ని, అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మహిళ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి స్వీకరించే రుణాలు ఇంటిఅవసరాలకు కాకుండా ఆర్థిక ఉన్నతికి తోడ్పాడేలా వినియోగించుకోవాలన్నారు. మార్కెటింగ్ సాంకేతిక పర్యవేక్షకులు కాంతారావు, సీఎంఎం భారతి, పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు. కందుకూరులోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష, మార్కెటింగ్ టీఈ కాంతయ్య, సీఎంఎం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పిడూరులో దాహం.. దాహం

మనుబోలు, న్యూస్‌టుడే: పదిరోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని మిక్స్‌డ్ కాలనీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి ఆందోళన చేపట్టారు. గిరిజనులు మాట్లాడుతూ.. పది రోజులుగా పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదన్నారు. దూరప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల స్నానానికి కూడా నీరు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. లేకుంటే ఎమ్మెల్యే సోమిరెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. పంచాయతీ కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ విద్యుత్తు నియంత్రిక కాలిపోవడంతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందని, కొత్త నియంత్రికను ఏర్పాటు చేసినప్పటికీ పైపులైను పూడిపోవడంతో సరఫరా కావడం లేదన్నారు. ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ

కోవూరు, న్యూస్‌టుడే: గీతాంజలి డిప్లమా కళాశాల విద్యార్థి జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపారు. బెంగళూరులో 20న జరిగిన సౌత్‌జోన్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో తమ కళాశాలలో డిప్లమా ప్రథమ సంవత్సరం చదువుతున్నా ఆదినారాయణ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రత్యేకంగా అభినందన సభ నిర్వహించారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

వెంకటాచలం : వీఎస్‌యూ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ పరీక్షలకు 4191 మంది హాజరు కాగా 220 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తెలిపారు. వీసీ విజయ భాస్కర రావు పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



విద్యార్థికి అభినందనలు

వెంకటాచలం : ముందస్తు గణతంత్ర దినోత్సవ క్యాంపునకు వీఎస్‌యూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4 వాలంటీర్ ప్రసాద్ ఎంపికయ్యారు. మహారాష్ట్ర జలగావ్‌లో నిర్వహించే శిబిరంలో ప్రసాద్ పాల్గొననున్నారు. విద్యార్థిని శుక్రవారం వీసీ విజయభాస్కరరావు, రిజిస్ట్రార్ సునీత, సమన్వయకర్త ఉదయ్ శంకర్ అభినందించారు.

చిక్కినట్టే.. చిక్కి పరార్!

సీతారామపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడినని చెప్పి సీతారామపురంలోని బంగారు దుకాణంలో 16.5గ్రాముల బంగారు వస్తువులతో ఉడాయించిన వ్యక్తి శుక్రవారం చిక్కినట్టే చిక్కి పరారయ్యాడు. దుకాణయజమాని వెంకటేశ్వర్లు, అతని కుటుంబీకులు సీసీ కెమెరాల చిత్రాలఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఆ క్రమంలో వైఎస్సార్ కడపజిల్లా పోరుమామిళ్లకు వెళ్లారు. ఆ సమయంలో బంగారంతో ఉడాయించిన వ్యక్తి ద్విచక్రవాహనంపై వారివైపే వస్తున్నాడు. బైకు నంబరును గుర్తించిన వారు వెంబడించారు. అప్రమత్తమైన నిందితుడు పరారయ్యాడు. నెల రోజుల క్రితం బద్వేలులోని ఓ బంగారు దుకాణంలో సైతం 25గ్రాముల బంగారంతో ఉడాయించినట్లుతెలుస్తోంది.



పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి వద్ద గురువారం జరిగిన హత్య కేసులో నిందితుడు షెడ్డు యజమాని పఠాన్ బాబు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వారు విచారిస్తున్నట్లు తెలిసింది. అయ్యప్పగుడి వద్ద అందరు చూస్తుండగానే ముక్తియార్‌ను నిందితుడు బాబు హతమార్చిన విషయం తెలిసిందే. క్షణికావేశంలో హత్య జరిగినట్లు పోలీసులు తేల్చారు. తన ఆటోను తాకట్టు నుంచి విడిపించేందుకు రూ.30వేలు కావాలంటూ నాలుగు రోజులుగా వేధించడమే కాకుండా దుర్భాష లాడుతుండటంతో బాబు హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి



కొడవలూరు, న్యూస్‌టుడే: కొడవలూరు మండలం తలమంచి గ్రామం వడ్డిపాళేనికి చెందిన **గంజి సత్యనారాయణ**(50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. గంజి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కోవూరులో నివసిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు స్వగ్రామం తలమంచి వడ్డిపాళెంలో ఉంటారని వచ్చి చూడగా ఉరేసుకొని మృతి చెంది ఉన్నారు. పెద్ద కుమారుడు అనిల్ తండ్రి మృతదేహాన్ని పరిశీలించగా శరీరంలో కొన్ని చోట్ల గాయాలున్నాయని పోలీసులకు ఫిర్యాదుచేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసునమోదు చేసి విచారిస్తున్నామని పేర్కొన్నారు.

ఉత్తర కాలువలో ట్రాక్టర్ బోల్తా

మెకానిక్ దుర్మరణం

అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నల్లపరాజుపాలెంలో ట్రాక్టరు అదుపు తప్పి ఉత్తర కాలువలో పడి షేక్ సాదిక్(47) మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆత్మకూరు పట్టణంలోని శివాలయం వీధికి చెందిన సాదిక్ ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. నల్లరాజుపాలెంలోని ఒక రైతుకు చెందిన ట్రాక్టరు మరమ్మతులకు గురికావడంతో గురువారం గ్రామానికి వచ్చారు. శుక్రవారం ఉదయం మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్ కోసం ఉత్తర కాలువ రోడ్డుపై వచ్చారు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తో సహా ఉత్తర కాలువలో పడి మృతిచెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

దెబ్బతిన్న కంది పైరు.. రైతన్నకు నష్టం



వర్షాలకు దెబ్బతిన్న కందిపైరు

వింజమూరు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాగులో ఉన్న కంది పైరు దెబ్బ తింది. మూడు నెలలు కాపాడుకుంటూ వచ్చినా. తుపాను ధాటికి పొలాల్లో నీరు నిలిచిపోవడంతో ఎందుకు పనికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 222 హెక్టార్లు కాగా ఈ ఏడాది 528 హెక్టార్లలో జిల్లాలోని మెట్ట మండలాల్లో కంది సాగు చేశారు. ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు నియోజకవర్గాల పరిధిలో జులైలో ఎక్కువగా వేశారు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ. 30 వేల వరకు ఖర్చు చేశారు. ఎకరానికి అయిదు నుంచి ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. గతేడాది క్వింటాల్ రూ.తొమ్మిది వేల వరకు పలికింది. ప్రస్తుతం కొమ్మలు విస్తరించే దశలో ఉంది. నవంబరులో పూతకు వస్తుంది. సంక్రాంతికి కాయ తయారవుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఎడతెరిపిలేని వానలు పడడంతో నీరు నిలిచింది. బయటకు వెళ్లదీసినా పలు చోట్ల పైరు నిలువునా ఎండిపోయింది. మరో మూడు నెలలు పూర్తయితే పంట చేతికొచ్చేదని వానల రాకతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మద్దూరు గోపాల్‌రెడ్డి, వింజమూరు

తొమ్మిది ఎకరాల్లో కంది వేశా. ఎకరానికి ఏడు వేల రూపాయల చొప్పున కౌలుకు తీసుకుని సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు మూడు ఎకరాలు పూర్తిగా దెబ్బ తింది. మరి కొంత పాక్షికంగా దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందజేయాలి.

నష్టపోయా

మండవ కోటేశ్వరరావు, వింజమూరు

రెండు రోజులు నీరు నిలిచి ఉండడంతో కంది పైరు రెండు ఎకరాల్లో నిలువునా ఎండిపోయింది. వర్షాధారంగా జూలైలో 20 ఎకరాలు కంది సాగు చేశా. పూత దశలో పురుగుమందుల పిచికారి మినహా అన్ని ఖర్చులు పెట్టాం. అధిక వర్షంతో పంట నష్టపోయా.

సర్వేకు ఆదేశించాం

జిల్లా వ్యవసాయాధికారిణి, సత్యవాణి

పంట నష్టంపై సర్వే చేసి నివేదిక పంపమని అధికారులకు ఆదేశాలిచ్చాం. బృందాలు ఏర్పాటు చేశాం. ఈ నెల 27 వరకు గడువు విధించాం. జాబితా రావాల్సి ఉంది. ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో దెబ్బతిన్నాయో తెలియాల్సి ఉంది. నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు



ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి విరాళం అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు

వరద బాధితులకు విరాళం

కావలి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కావలికి చెందిన ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రతినిధులు ఉదారత చాటుకున్నారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి రూ.2లక్షల మొత్తాన్ని డీడీ రూపంలో శుక్రవారం విరాళం అందజేశారు. ఎమ్మెల్యే వారిని అభినందించారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

కావలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ ఫలాలు పేదలకు అందుతున్నాయని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్, లెటర్ ఆఫ్ క్రెడిట్ చెక్కులను లబ్ధిదార్లకు అందజేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన తెదేపా రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లును ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

పోలీసు విధులకు సహకరించాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ప్రజలు శాంతిభద్రతలతో ప్రశాంతంగా ఉన్నారంటే అందుకు పోలీసుల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అసాంఘిక శక్తులు, కార్యకలాపాలు నివారించేందుకు పోలీసుల విధులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డీఎస్పీ సీహెచ్.వి.బాలసుబ్రహ్మణ్యం, సీఐలు, కె.వెంకటేశ్వరరావు, మంగారావు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రసాభాస

కొండాపురం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. అధికారుల వారి పనితీరును వివరిస్తున్న సందర్భంగా కొందరు సర్పంచులు పనులకు సంబంధించిన తీర్మానాలు తమకు తెలియకుండానే ఎలా చేశారని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంపీడీవో ఆదినారాయణ పాల్గొన్నారు.





విరిసిన ప్రతిభ

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఐఏఎస్ పాఠశాలలో ఈనాడు ప్రతిభ పాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. వీ.పుష్పవల్లి, బీ.హంసిత, పీవీఎల్ అఖిల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఏవో ముసునూరు బాలయ్య, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు.

ఉపాధి నిధులు.. పల్లె ప్రగతికి మెట్లు

రూ.15 కోట్లతో పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి(పాత చిత్రం)

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

గత తెదేపా ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి గ్రామాల్లో వందల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో రోడ్ల నిర్మాణాల ఊసే ఎత్తలేదు. అంతర్గత మట్టి రోడ్లు గుంతలు, రాళ్లతో ఎగుడు దిగుడుగా ఉన్నా కనీసం మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన రోడ్లను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టిసారించింది. అందులో భాగంగా కందుకూరు నియోజకవర్గానికి రూ.15 కోట్లు ఉపాధి నిధులు కేటాయించి పల్లె ప్రగతికి శ్రీకారం చుట్టింది.

వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను విద్యుత్తు ఇతర బకాయిల కింద జమ చేసుకుని వాడుకుంది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కరవయ్యాయి. నడిచేందుకు రోడ్లు లేక దయనీయ స్థితిలో గ్రామాలు ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించింది. ఉపాధి హామీ కింద ప్రజల వెతలు తీర్చేందుకు నడుం బిగించింది. నియోజకవర్గంలో 92 పంచాయతీలు, వీటి పరిధిలో సుమారు 130 గ్రామాలున్నాయి. ఒక్కో మండలానికి రూ.3 కోట్లు చొప్పున నిధులు కేటాయించారు. వీటితో ప్రతిపాదించిన గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 189 సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు ఇలా..

మండలం	గ్రామాలు	పనులు	నిధులు(రూ.కోట్లు)
కందుకూరు	16	42	2.82
గుడ్లూరు	24	43	3.0
ఉలవపాడు	12	43	3.0
వలేటివారిపాలెం	17	25	3.0
లింగసముద్రం	14	34	3.0



ఉలవపాడు మండలం రామాయపట్నంలో మట్టిరోడ్డు

సంక్రాంతిలోపు పూర్తి
వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ

కందుకూరు నియోజకవర్గంలో 189 పనులకు రూ.15కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే అయిదు మండలాల్లో 15 గ్రామాల్లో పర్యటించి శంకుస్థాపనలు చేయడం జరిగింది. దాదాపు అన్ని పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే సంక్రాంతి పండగలోపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



ఎమ్మెల్యే కాకర్లను సన్మానిస్తున్న స్థానికులు

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కలిగిరి, న్యూస్‌టుడే: కలిగిరిలోని కొత్తూరులో నూతనంగా నిర్మించిన శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీకోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. వేడుకల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని పూజలు జరిపారు. అనంతరం స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెదేపా మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అడుగు పెట్టాలంటే అవస్థలే



ఇక్కడ కనిపిస్తున్న రోడ్డు పొలాలకు వెళ్లే గట్టు దారి అనుకుంటే పొరపాటే. మండలంలోని రేణమాల ర.భశాఖ రోడ్డు నుంచి పాతూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. సుమారు ఆరు నెలల కిందట రోడ్డు పనులు ప్రారంభించారని పనులు పూర్తి చేయకుండా వదిలేశారని గ్రామస్థులు తెలియజేస్తున్నారు. కొద్దిపాటి చినుకు పడినా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పృధ్వీ మాట్లాడుతూ. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొండాపురం

నీటికి ఇక్కట్లు

మండలంలోని శాఖవరం ఉన్నత పాఠశాలలో విద్యుత్తు మోటారు రెండు రోజుల క్రితం చెడిపోవడంతో కుళాయిలకు నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో మధ్యాహ్న భోజనం చేయడానికి నీరు లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. సమీపంలోని శిథిలావస్థకు చేరిన వసతి గృహం వద్ద ఉన్న చేతిపంపు వద్దకు పిచ్చి మొక్కల మధ్య వెళ్లాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవో2 మల్లికార్జునరావు మాట్లాడుతూ.. మోటారును మరమ్మతులకు పంపించారని, శనివారం బిగించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం



ఇలాగైతే నీటి నిర్వహణ ఎలా?



మండలం నాగులవరం-తాళ్లూరు మధ్యలో శ్రీవెంకటేశ్వర పాళెం మేజరు కాలువ పదో కిలో మీటరు వద్ద ఉన్న రెగ్యులేటర్ దెబ్బతింది. సెక్టర్ లేక పోవడంతో మెరక ప్రాంతంలో ఉన్న ఉపకాలువలకు తాగునీరు మళ్లించడం సాధ్యం కావడం లేదు. ఈ విషయమై సోమశిల బిట్రగుంట సబ్ డివిజన్ డీఈఈ సత్యప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు విడుదల కాకముందే రెగ్యులేటర్ షట్టర్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, బోగోలు, బిట్రగుంట

బస్సులకు అడ్డంగా..

పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రాకపోకలు సాగించే చోట శుక్రవారం మధ్యాహ్నం అడ్డంగా నిలిపేసిన ఓ కారు. దీంతో డిపో నుంచి వెలుపలకు వచ్చే బస్సులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కారు చోదకుడు మద్యం తాగేందుకు వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇలాంటి ఇబ్బందులు నిత్యం అనేకం వస్తున్నాయన్నారు. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళుతున్నట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, కావలి



నిఘా నేత్రం నిస్తేజం



సీతారామపురం బస్టాండ్ కూడలి

ఏవైనా ప్రమాదాలు, చోరీలు, నేరాలు జరిగినప్పుడు వాటిని ఛేదించేందుకు నిఘానేత్రాల పాత్ర కీలకం. శాంతిభద్రతల పర్యవేక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు, నిఘాకోసం వీటి అవసరముంది. కానీ మండలకేంద్రమైన సీతారామపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

ఇటీవల సీతారామపురం బస్టాండ్ కూడలికి సమీపంలో ఓ బంగారు దుకాణంలో ఉపాధ్యాయుడిని అనిచెప్పి, రెండు జతల బంగారు కమ్మలు, రెండు ఉంగరాలు తీసుకుని ఉడాయించాడు ఓ మోసగాడు. అతడిని గుర్తించేందుకు ఓ దుకాణ యజమాని, పెట్రోల్‌బంకులో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీ ఉపయోగపడింది.

న్యూస్‌టుడే, సీతారామపురం

మూడు జిల్లాల సరిహద్దు మండలమైన సీతారామపురంలో ఏర్పాటు చేసిన 'నిఘా నేత్రాలు' కొన్నినెలలుగా పనిచేయడంలేదు. ఫలితంగా నిఘా కొరవడింది. 2018 డిసెంబరు ప్రాంతంలో అప్పటి ఎస్పీ ఐశ్వర్యరస్తోగి ఆదేశాల మేరకు స్థానిక బస్టాండ్ కూడలిలో దుకాణదారుల సహకారంతో పోలీసుశాఖ మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డీజీపేట వెళ్లే రోడ్డు, ఉదయగిరి మార్గం, గ్రామంలోకి వెళ్లే దారులు కనిపించేలా ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పర్యవేక్షణ చేసేలా కంప్యూటర్‌కు అనుసంధానించారు. ఫలితంగా కూడలిలో ఏం జరుగుతుందన్న విషయాన్ని పోలీసులు పరిశీలించుకునే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం సీసీకెమెరాలు పనిచేయని కారణంగా ఆ పరిస్థితి లేదు. నిర్వహణ కరవవడంతో ప్రస్తుతం సీసీ కెమెరాలు సైతం కనిపించడంలేదు. ఎన్నికల కారణంగా ఒక సీసీ కెమెరాను కూడలిలో అమర్చినా... అది కూడా పనిచేయని పరిస్థితి.



చెక్‌పోస్టు వద్ద పనిచేయని సీసీ కెమెరాలు

అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అదే పరిస్థితి

ఎర్రచందనం అక్రమరవాణా అరికట్టేందుకు సీతారామపురం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోరుమామిళ్ల, ఉదయగిరి వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించేలా రెండు 2018లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే వీటి పర్యవేక్షణ ఉదయగిరి రేంజ్ కార్యాలయంలో ఉండేలా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కొంత కాలం ఇవి సక్రమంగా పనిచేశాయి. ఆ తరువాత నిరుపయోగంగా మారాయి.

చర్యలు తీసుకుంటాం: శివకృష్ణారెడ్డి, ఎస్సై

ఇటీవలే సీతారామపురం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నాను. బస్టాండ్ కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు, స్థానికుల సహకారంతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.





సృజనకు పదును..

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గుర్రంవారిపాలెంలో ఉన్న శ్రీ సంస్కృతి పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వి.హన్సిక, జి.భవ్యశ్రీ, కె.సత్యభవ్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఉపాధ్యాయులు జి.శోభారాణి, బి.వెంకటప్రసాద్ బహుమతులు అందజేశారు.

ఉద్యోగాలకు ఎంపిక

కందుకూరు పట్టణం : నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. 34 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ అధికారి అబ్దుల్ ఖయూమ్ తెలిపారు. ప్రిన్సిపల్ కె.మస్తానయ్య ఉన్నారు. ఉదయగిరి : మేకపాటి రాజమోహన్ రెడ్డి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ నరసింహులు తెలిపారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

జలదంకి, న్యూస్‌టుడే: ఉపాధి పనుల్లో నాణ్యత లోపించటంతో పాటు కొలతల్లో తేడాలు వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎన్ఆర్‌జీఎస్ క్వాలిటీ కంట్రోల్ డీఈ సతీష్‌బాబు హెచ్చరించారు. జలదంకి, బ్రాహ్మణక్రాక మేజర్ కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను శుక్రవారం పరిశీలించారు.

వక్ఫ్‌బోర్డుకు భూముల అప్పగింత

ఉలవపాడు : రాజుపాలెంలో అక్రమణలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను శుక్రవారం రెవెన్యూ అధికారులు బోర్డు అధికారులకు అప్పగించారు. సర్వే నంబరులో 304ఎలోని 39.64సెంట్ల భూమిని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదవన్‌కు అప్పగించారు. తహసీల్దారు లావణ్య, ఎస్సై అంకమ్మ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఉదయగిరి, న్యూస్‌టుడే: వచ్చేనెల 4వ తేదీ కార్తిక సోమవారం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. నవంబరు 3వ తేదీ ఉదయం 8 గంటలకు ఉదయగిరి నుంచి బయలుదేరుతుందన్నారు. దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా సిరిపురం, గోల్డెన్ టెంపుల్‌ను ప్రయాణికులకు చూపించుకొని అరుణాచలం చేరుతుందన్నారు. రానుపోను ఒక్కొక్కరికి రూ.1650 ఛార్జీ ఉంటుందన్నారు.

విద్యుత్తు కష్టాలు తీర్చాలంటూ ఆందోళన

జలదంకి, న్యూస్‌టుడే: జలదంకి ఉప కేంద్రం పరిధిలో సరిపడ సిబ్బంది లేక తరచూ విద్యుత్తు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఏఈ కృష్ణ కిషోర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

అధ్యాపకుల నియామకం

గుడ్లూరు : స్థానిక హైస్కూల్ ప్లస్ కళాశాలలో ఇద్దరు అధ్యాపకులను నియమించినట్లు హెచ్‌ఎం రాంమోహన్ శుక్రవారం తెలిపారు. రెండురోజుల క్రితం అధ్యాపకుల నియమించాలంటూ విద్యార్థులు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి తెలుగు, వాణిజ్యశాస్త్రం అధ్యాపకులను నియమించారని, మిగిలిన వాటికి అర్హతగల వారితో బోధన చేయిస్తామని హెచ్‌ఎం వివరించారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కందుకూరు గ్రామీణం : కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖాధికారి ప్రియంవద సూచించారు. పందలపాడులో శుక్రవారం ఆమె పర్యటించారు. సచివాలయాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు ఇంటింటి సర్వే చేయించాలని. నీటిని క్లోరినేషన్ చేయించాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి జువేరియాభాను, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : కావలి నుంచి వట్టూరు ఆదర్శ పాఠశాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు రావడం లేదు. ఒక్కొక్క విద్యార్థి రూ.60వరకు రోజు ఖర్చు చేసి వెళ్లాల్సి వస్తోంది. - కరవాది భాస్కర్

సమాధానం : ఆ మార్గంలో ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయంగా బస్సును జువ్వలదిన్నె మీదుగా రెండు రోజుల్లో నడుపుతాం. - రాపూరి శ్రీనివాసులు, కావలి డిపో మేనేజర్, - న్యూస్‌టుడే, కావలి,

? పట్టణంలోని కోవూరురోడ్డు ఏడో వీధిలో పదిహేను రోజులు నుంచి కాలువలు శుభ్రం చేయడం లేదు దుర్వాసన వస్తోంది. - గౌతమ్

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. - కె.అనూష, మున్సిపల్ కమిషనర్, - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

?మండలంలోని రాజుపాలెం తాగునీటి బావి వద్దకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. - పి.అరుణ్

✓పరిశీలించి వెలిగించే ఏర్పాటు చేస్తాను. మహేశ్, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, గుడ్లూరు

? స్థానిక పంచాయతీలో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. - చైతన్య, గ్రామస్థుడు

✓ కాలువలను శుభ్రం చేయించి, దోమల నివారణకు బ్లీచింగ్ చల్లిస్తాం. - మాధవరావు, కార్యదర్శి,- లింగసముద్రం

? దగదర్తిలోని గిరిజన కాలనీలో చెత్త పేరుకు పోయింది తొలగించగలరు.- వెంకయ్య

✓పరిశీలించి.. రెండు రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం. - మయూరి, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, దగదర్తి

? కాంచెరువు గ్రామంలో మూడు నెలలుగా ఉపాధి పనులు నిలిపివేశారు. పూట గడవటమే కష్టంగా ఉంది. - వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓పనులకు సంబంధించి పంచాయతీ సర్పంచి తీర్మానం ఇవ్వలేదు. పీడీ దృష్టికి తీసుకెళ్లాం. పది రోజుల్లో పనులు ప్రారంభించి కూలీలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - అజామ్‌ఖాన్, ఏపీవో - న్యూస్‌టుడే, వరికుంటపాడు

కూలీ ఆత్మహత్య

ఇందల్‌వాయి : నిర్మాణంలో ఉన్న భవనంలో మేస్త్రీ దగ్గర పనిచేసేందుకు వచ్చిన కూలీ ఉరేసుకొని మృతిచెందిన ఘటన తెలంగాణ రాష్ట్రం ఇందల్‌వాయి మండలం గన్నారంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం తిమ్మరెడ్డిపల్లికి చెందిన షేక్ అబ్దుల్‌జిలానీ(34) నెల కిందట గన్నారంలోని ఓ మేస్త్రీ వద్ద పనిలో చేరారు. మద్యానికి బానిసై పనిచేస్తున్న ఆయన ఇంట్లోనే ఉరేసుకొని మృతిచెందారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. తప్పిన ప్రమాదం

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ట్యాంక్‌బండ్ కూడలిలో ఆర్టీసీ బస్సు, కారు శుక్రవారం ఢీకొన్నాయి. వివరాల మేరకు ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో కావలి నుంచి వస్తుంది. చిన్ననాగంపల్లికి చెందిన వ్యక్తులు కారులో నెల్లూరుకు వెళ్లే క్రమంలో రెండు వాహనాలు ట్యాంక్‌బండ్ కూడలి వద్ద ఢీకొన్నాయి. కారు కుడివైపు ముందు భాగంలో దెబ్బతింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. అనంతరం ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

కందుకూరు గ్రామీణం : మోపాడు గ్రామ సచివాలయానికి యూరియా బస్తాలతో వచ్చి లారీ లోపలికి వెళ్లే సమయంలో విద్యుత్తు తీగలు తగలడంతో నిప్పురవ్వలు వచ్చాయి. స్థానికులు గమనించి కేకలు వేయటంతో లారీని నిలిపివేశారు. అనంతరం కర్రలతో తీగలను పైకిలేపి లారీని పంపించారు. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.

బంగారం తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదు

కావలి: వ్యాపార లావాదేవీల్లో భాగంగా బంగారాన్ని తీసుకుని తిరిగి ఇవ్వాలేదంటూ బంగారు వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలి ఒకటో పట్టణ ఎస్సై సుమన్ వివరాల మేరకు బృందావనకాలనీకి చెందిన పబ్బిశెట్టి సతీష్.. బంగారం వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఉన్నం వేణు వ్యక్తి 203.12 గ్రాముల బంగారాన్ని తీసుకున్నాడు. దానికి సంబంధించి నగదుగాని తిరిగి బంగారంగాని ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు నిందితుడ్ని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చెక్‌డ్యాం నిర్మాణం ఎన్నడో..?

మండలంలోని గుడ్లూరు సమీపంలో ఉప్పుటేరు ఎత్తు వంతెన వద్ద చెక్‌డ్యాం నిర్మాణం కోసం రైతులు గత అయిదేళ్లుగా ఎదురు చూస్తున్నారు. వంతెనకు దిగువన వంద మీటర్ల దూరంలో చెక్‌డ్యాం నిర్మాణం కోసం అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో 2018లో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రయత్నం అటకెక్కింది.



ఉప్పుటేరులో వృథాగా పోతున్న నీరు

న్యూస్‌టుడే, గుడ్లూరు, కందుకూరు

ఎత్తు వంతెన దిగువన 2018లో స్థానిక తెదేపా నాయకులు ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా పాత చప్టాను చెక్‌డ్యాంగా మార్చారు. సుమారు రూ.రెండు లక్షల వ్యయంతో చప్టా తూములను ఇసుక బస్తాలతో మూసివేశారు. దీంతో రెండు కిమీ దూరం ఎగువకు పది అడుగుల మేర నీరు నిలిచాయి. దీంతో బసిరెడ్డిపాలెం నుంచి గుడ్లూరు వరకు ఏరుకు ఇరువైపులా సుమారు అయిదు వేల ఎకరాల్లో భూగర్భ జలం పెరిగింది. మెట్టపంటల సాగుకు అనుకూలంగా మారింది.

- గత అయిదు సంవత్సరాలుగా చప్టాను, తాత్కాలిక చెక్‌డ్యాంను పట్టించుకోకపోవడంతో ఇసుక బస్తాలు కొట్టుకునిపోయాయి. దీంతో ఎగువ నుంచి వచ్చిన నీరు నిల్వకుండా దిగువకు పోతుండటంతో పరివాహక ప్రాంతంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో చెక్‌డ్యాం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

భూగర్భ జలాలు తగ్గుతున్నాయి :

గతంలో పాత చప్టాను చెక్‌డ్యాంగా మార్చారు. ఇది ఎంతో ఉపయోగంగా మారింది. రైతులతో పాటు, పశువులకు నీరు సమృద్ధిగా లభించింది. ప్రస్తుతం నీరు నిల్వలేకపోవడంతో భూగర్భజలాలు తగ్గుతాయి. చెక్‌డ్యాంను నిర్మించాలి. **వేణు, రైతు**

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



ప్రతిభకు పదును



కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఆర్.కార్తికేయ(ప్రథమ) ఎం.దివ్యతేజ(ద్వితీయ), ఎస్‌కే ముస్రాత్ జహాన్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరెస్పాండెంట్ నందకిశోర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : మనుబోలు మండలంలోని పిడూరు మిక్సడ్ కాలనీలో మురుగు నీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వీధుల్లోనే మురుగు నీరు ప్రవహిస్తోంది. కాలువల్లో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది.

- సుబ్బమ్మ, స్థానికురాలు

సమాధానం : పరిశీలించి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- అంకయ్య, పంచాయతీ కార్యదర్శి**

భక్తిశ్రద్ధలతో పూజలు

సంగం, న్యూస్‌టుడే: చెర్లోవంగల్లు గ్రామ గిరిజన కాలనీలో శుక్రవారం పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. తొలుత విగ్రహాలకు ధాన్యాది, జలాది, పుష్పాది వాసం నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేసి ఆలయానికి కుంభాభిషేకం చేశారు. మాజీ సర్పంచి పి.రఘురామయ్య కుటుంబ సభ్యులు కైంకర్యం చేశారు.

ప్రతి అర్జీ పరిష్కరిస్తాం

విడవలూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: రీ సర్వే ద్వారా భూసమస్యలపై వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించడమే లక్ష్యమని విడవలూరు తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. వావిళ్లలో రీ సర్వేపై వచ్చిన వినతులపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచి రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు రమా, రీసర్వే డీటీ సలాం, సర్వేయరు ఎస్‌కె.మస్తాన్ బాష, వీఆర్వో కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇందుకూరుపేటలో శుక్రవారం జరిగిన గ్రామసభలో 41 భూసమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసి తమకు న్యాయం చేయాలని పలువురు ఫిర్యాదుల్లో కోరారు.

అరకొర వసతులు.. అందని సేవలు



విడవలూరు మండలం అలగానిపాడులో ఆధార్ కేంద్రం

ఆత్మకూరు గ్రామీణం, బుచ్చి, విడవలూరు, పొదలకూరు, రాపూరు, కలువాయి, న్యూస్‌టుడే

ప్రస్తుతం ఎలాంటి దరఖాస్తుకైనా ఆధార్ అత్యంత కీలకంగా మారింది.... ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి వివిధ వర్గాల ప్రజలు ఏ కార్యాలయానికి వెళ్లినా ఇదే కీలకంగా మారింది.. గతంలో పేర్లు, ఏడాది ఇతర నమోదులో జరిగిన తప్పుల సవరణకు తాజాగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు సచివాలయాలు, ప్రభుత్వం సూచించిన కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి. అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో నామమాత్రంగా జరిగింది. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లోని కేంద్రాలను పరిశీలించిన దాఖలాలు లేవు. గత వైకాపా ప్రభుత్వంలో సచివాలయాల్లో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో అలంకారప్రాయంగా ఉన్నాయి. తాజాగా అధికారులు వాటిని పర్యవేక్షించకపోవడంతో చాలా కేంద్రాల్లో మమ అనిపించారు.

● ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మర్రిపాడు, నందవరం, కంపసముద్రంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మర్రిపాడు, నందవరం సచివాలయాల్లోని యంత్రాలు మరమ్మతులకు గురి కావడంతో ప్రజలకు ఆధార్ సేవలు అందలేదు. కంపసముద్రం సచివాలయంలో అరకొరగా చేశారు. కూటమి ప్రభుత్వం ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. కంపసముద్రంలో ఆధార్ సేవలు అందుతున్నాయని, మర్రిపాడు, నందవరం సచివాలయాల్లో యంత్రాలు మరమ్మతులకు గురవడం వల్ల సేవలు అందలేదని ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ తెలిపారు. ● ఇందుకూరుపేట మండలంలో రోజుకు ఒక్కో పాఠశాలలో ఆధార్ కేంద్రాన్ని నిర్వహించామని ఎంపీడీవో నాగేంద్రబాబు తెలిపారు. మైపాడు పంచాయతీ కృష్ణాపురం, కుడితిపాలెం ప్రాథమిక పాఠశాలలో పూర్తయిందని శనివారం కొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ● విడవలూరు మండలంలో 15 పంచాయతీలు ఉండగా అలగానిపాడు, రామతీర్థం లోని సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ● పొదలకూరు మండల కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రెగ్యులర్ ఆధార్ కేంద్రంలోనే మాత్రమే సేవలు కొనసాగాయి. మండల పరిధిలో పొదలకూరు-2 సచివాలయం, డేగపూడి, మొగుళ్లూరు, నావూరు, తాటిపర్తి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చాలా మంది సచివాలయాల వద్దకెళ్లి అక్కడ లేకపోవడంతో మండల కేంద్రానికి వెళ్లారు. తాటిపర్తి మినహా మిగతా అన్నిచోట్ల సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. ● మనుబోలు మండలంలో ఎక్కడా శిబిరాలు ఏర్పాటు చేయలేదు. 19 పంచాయతీల పరిధిలో 14 గ్రామ సచివాలయాలు, 53 పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆధార్ నమోదు, నవీకరణకు అవసరమైన పరికరాలు పనిచేయకపోవడంతో ఏర్పాటు చేయలేదని అధికారులు పేర్కొన్నారు. ● కలువాయిలో ఒక కేంద్రాన్ని మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచారు. సచివాలయాల పరిధిలో ఎక్కడా లేకపోవడంతో అవస్థలు పడ్డారు. ● రాపూరు మండలంలో మద్దెలమడుగు, శానాయపాళెం సచివాలయాలతో పాటు రాపూరులో గిరిజన సముగ్రాభివృద్ధి సంస్థ మరో కేంద్రం అందుబాటులో ఉంది. గోనుపల్లి, సైదాదుపల్లి కేంద్రాల్లో యంత్రాలు మరమ్మతులకు గురవడంతో అక్కడ చేయడం లేదు. ● ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చాలా చోట్ల అరకొరగా కాకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించి పర్యవేక్షణకు అధికారులను నియమించాలని పలువురు సూచిస్తున్నారు.



పొదలకూరులో ఒక కేంద్రమే దిక్కు

ఆధార్ నవీకరణకు అగచాట్లు

సర్వేపల్లిని అగ్రగామిగా నిలపాలి



తోటపల్లిగూడూరు, మనుబోలు : పార్టీ సభ్యత్వ నమోదును ప్రతిఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సర్వేపల్లిని అగ్రగామిగా నిలపాలని సర్వేపల్లి శాసనసభ్యులుసోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయంలో శుక్రవారం మనుబోలు, తోటపల్లిగూడూరు మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించి పార్టీ సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెట్లు నరికితే మనుగడ ప్రశ్నార్థకం



పొదలకూరు, న్యూస్‌టుడే: చెట్లను కాపాడాలన్న నినాదంతో పాఠశాల విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ అన్నారు. శుక్రవారం పొదలకూరు జడ్పీ బాల, బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రపంచ ఆర్టిస్ట్ డే సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్, సునంద, ఉపాధ్యాయులు ఏ.వి. సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



సంగం కొండ మీద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఇసుకగుట్ట ప్రమాదకరంగా ఉంది. కొండ మీద నుంచి సంగం వైపు దిగే వాహనాలు ఏటవాలు కారణంగా వేగంగా కిందకు దిగుతాయి. రాత్రి సమయాల్లో కనిపించడం లేదు. ఎదురువాహనం వచ్చినా తప్పించే క్రమంలో అటువైపు వెళ్లే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. ఎస్సై రాజేశ్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, సంగం, ఆత్మకూరు**

శిథిలావస్థలో వంతెన



మండలంలోని గంగపట్నం, రాముడుపాలెం మార్గంలో వంతెన ప్రమాదకరంగా ఉంది. రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రిపూట అటుగా రాకపోకలు సాగించే వాహనాలు కాలువల్లో దూసుకెళుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇందుకూరుపేట**

నిల్వ ఆహారం విక్రయించడంపై జరిమానా

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: డబ్బులిస్తున్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని నగర పంచాయతీ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుచ్చి నగర పంచాయతీలోని ఒక హోటల్‌పై ఫిర్యాదు అందడంతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న చపాతీలు, మసాలా దినుసులు, కిచెన్ పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత కనిపించింది. వెజ్, నాన్‌వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడంతో జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేయనున్నారని తెలిపారు.



బుచ్చిలో తనిఖీ చేసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

❖ పందుల పెంపకందారుల వద్దకు వెళ్లిన కమిషనర్ నగర పంచాయతీలో పందుల పెంపకం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతినగర్, మంగలికట్ట, గాంధీనగర్, తదితర ఆక్రమణస్థలాల్లో పందుల పెంపకం చేయడం చట్టవిరుద్ధమన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లోకి వెళ్లాలన్నారు.

సృజన వికాసం





అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మోడల్ ప్రభుత్వం పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. జి. నిహారిక (ప్రథమ), సీహెచ్ వైష్ణవి(ద్వితీయ), పి. పౌర్ణమి(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదీప్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుస్సేన్, రవి, నర్మద, మల్లికార్జున, మౌలానా పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

పొదలకూరు : ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడితే పోలీసు కేసులు తప్పవని ఎస్సై మహ్మద్ హనీఫ్ హెచ్చరించారు. శుక్రవారం పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడితే ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాహీద్, జనార్దన్, పచ్చిపాల పెంచలయ్య, రాము, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులోని అర్బన్ పీహెచ్‌సీని ఆర్డీవో పావని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమావేశమై రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా చేపడుతున్న కార్యక్రమాలు తెలుసుకున్నారు. వైద్యాధికారిణి ఆస్మా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భూములపై హక్కులు కోల్పోయాం

చేజర్ల, న్యూస్‌టుడే: రీసర్వే కారణంగా గ్రామంలో మా భూములపై హక్కులు కోల్పోయాయమని ఇరుగు పొరుగుతో కొత్త వివాదాలతో సతమతమవుతున్నామన్నారు. పాత దస్త్రాలు పరిశీలించి గతంలో ఉన్న హక్కులను పునరుద్ధరించాలని పెరుమాళ్లపాడు రైతులు శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆవేదన వ్యక్తం చేశారు. హద్దులు సక్రమంగా ఏర్పాటు చేయక పోవడంతో పాటు, పట్టా భూములను ప్రభుత్వ భూములుగాను వేరొకరి పేర్లతో నమోదు చేయడంతో గ్రామాల్లో వివాదాలు నెలకొన్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. అభ్యంతరాలు ఉన్న భూములన్నింటిని పూర్తిస్థాయిలో విచారించి లోపాలు సరి చేస్తామని తహసీల్దారు మస్తానయ్య అన్నదాతలకు వివరించారు.

గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో శుక్రవారం రీసర్వే భూసమస్యలపై నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి వచ్చి అర్జీలను రెవెన్యూ అధికారులతో కలిసి స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కాలువలు తవ్వకుండానే రూ.లక్షలు బిల్లులు చేసుకున్నారని, జగనన్న ఇళ్లల్లో భారీ కుంభకోణం జరిగిందని, త్వరలో విజిలెన్స్ విచారణ వేయిస్తామని తెలిపారు. సర్పంచి భాస్కర్, రీసర్వే డీటీ గణేశ్, ఆర్ఐ ద్వారకానాథ్, సర్వేయర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కాలువ పూడికతీత

విడవలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసి పొక్లెయిన్‌తో వరిణి చెరువు ఒకటో నంబర్ కాలువ పూడికతీత పనులు శుక్రవారం తెదేపా నాయకులు ఆవుల వాసు ఆధ్వర్యంలో ప్రారంభించారు. దీంతో చివరి ఆయకట్ట వరకు రైతులకు సాగు నీరందుతుందని తెలిపారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన కాలువ పూడితీత పనులకు శ్రీకారం చుట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరిణి, దండిగుంట, రామచంద్రాపురం, రామతీర్థం రైతులు, నాయకులు పాల్గొన్నారు.



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న నాయకులు

రీసర్వే రద్దు చేయాలని వినతి



అధికారులతో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

మనుబోలు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే రద్దు చేయాలని తెదేపా నాయకుడు వెంకటరమణారెడ్డి రైతులతో కలిసి అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో నాగశేఖర్ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూమి విస్తీర్ణం, పేర్లు మార్పులుంటే దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దారు సుబ్బయ్య, రీసర్వే డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

సంగం, న్యూస్‌టుడే: సంగం-కలిగిరి మార్గంలో ప్రమాదానికి గురైన ఒక వాహనాన్ని శుక్రవారం మరమ్మతుల కోసం రికవరీ వ్యాను తరలిస్తుండగా, వేగంగా వచ్చిన మరొక కారు దాన్ని ఢీకొంది. ఫలితంగా గాయపడిన వ్యక్తిని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ వైద్య చికిత్సకు తరలించారు.

పుస్తకావిష్కరణ

కొడవలూరు : ఔషధ శాస్త్రంలో కృత్రిమమేధ పాత్రపై వెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవీలత 'ఫార్మకాలజీ- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' పుస్తకాన్ని రచించారు. పుస్తకాన్ని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి గుణశేఖర్ గురువారం ఆవిష్కరించారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఒకటో సచివాలయంలో కొనసాగుతున్న మేజరు పంచాయతీ కార్యాలయాన్ని ఈనెల 5న పోలీసు స్టేషను సమీపంలో నూతనంగా నిర్మించిన భవనంలోకి పంచాయతీ కార్యదర్శి లేకుండా పాలకవర్గ సభ్యులు మార్చడంపై తెదేపా, వైకాపా నాయకుల మధ్య వివాదం జరిగిన విషయం విదితమే. పోలీసులు స్పందించి జిల్లా అధికారులు నిర్ణయించే వరకు తీయొద్దని తాళాలు వేసి తహసీల్దారుకు అప్పగించారు. అప్పటి నుంచి దస్త్రాలు, పారిశుద్ధ్య పరికరాలు ఇతర సామగ్రి భవనంలోనే ఉన్నాయి. ఈ క్రమంలో నవంబరు నెల పింఛన్ల పంపిణీకి సమయం దగ్గర పడటంతో అవసరమైన దస్త్రాలు, బ్యాంకు చెక్కు పుస్తకాలు అవసరమవగా ఎంపీడీవో, తహసీల్దారు, పోలీసుల అనుమతితో కార్యాలయ తాళాలు గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి దొరబాబు తెరిచారు. దస్త్రాలు తీసుకొని వాటిని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ బాలకృష్ణయ్యకు అప్పగించి మళ్లీ తాళాలు వేశారు. సర్పంచి చిట్టెమ్మ, ఉప సర్పంచి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయాన్ని మారిస్తే ఊరుకోమని పంచాయతీ కార్యకలాపాలు ఇక్కడే కొనసాగాలన్నారు. దీనిపై అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

కుల్లూరులో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

కలువాయి, న్యూస్‌టుడే: మండలంలోని కుల్లూరు వీరాంజనేయస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూల విగ్రహపీఠం, ఒంటి వాహనం, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాది కార్యక్రమాలు విశేష పూజలు జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ జీర్ణోద్ధరణను చల్లా సీతారాం, కమల దంపతులు భక్తుల సహకారంతో నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మాదాసు దంపతులు

పులిగిలపాడులో కూలిన స్లాబ్




రాపూరు : మండలంలోని పులిగిలపాడులో కంకర క్వారీల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌తో సమీప గృహాలు కంపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం కృష్ణయ్య అనే వ్యక్తి ఇం టి మైప్పు పెచ్చులూడి కింద పడటంతో భయాందోళనకు గురయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇంటి నుంచి క్వారీ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. దీనిపై విచారిస్తున్నామన్నారు.

వ్యవసాయ యంత్రాలకు ఎదురు చూపులు

వైకాపా పాలనలో నిబంధనలకు తిలోదకాలు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

అయిదేళ్ల వైకాపా పాలనలో వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారు... ఆర్బీకే కేంద్రాలు ఏర్పాటు చేసి వసతులు సమకూర్చకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి... అన్నదాతలకు సాగు చేసేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డారు. కొన్నేళ్లుగా అమలవుతున్న రాయితీ సామగ్రి ఇవ్వకపోవడంతో అవస్థలు పడ్డారు. వ్యక్తిగతంగా అవసరమైన వారికి కాకుండా వైకాపా నాయకుల అనుయాయులకు మాత్రమే రెండేళ్లు ఇచ్చి మమ అనిపించారు. వ్యవసాయానికి అతిముఖ్యమైన స్ప్రేయర్లు, రోటోవేటర్లు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు అందుబాటులో లేక సాగు కష్టంగా మారింది.



పిచికారీ చేస్తున్న రైతు

గతంలో నాయకుల ఇష్టారాజ్యం

సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలతో పాటు డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజకవర్గ పరిధిలో వైకాపా హయాంలో రైతులను సంఘాలుగా ఏర్పాటుచేసి వారికి రాయితీ యంత్ర పరికరాలు అందించారు. వాటిల్లో ఎక్కువగా వైకాపా సానుభూతిపరులు, నాయకులు మాత్రమే సభ్యులుగా చేరారు. బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో అప్పటి నాయకులే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

రైతులపై అదనపు భారం..

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వైకాపా ప్రభుత్వంలో 13 సంఘాలకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించారు. వారికి తప్ప మిగిలిన రైతులకు అందలేదు. ముఖ్యమైన స్ప్రేయర్లు అందుబాటులో లేకుండా పోయాయి. అద్దెకు తెచ్చుకొని సన్న, చిన్నకారు రైతులు వినియోగించే పరిస్థితి నెలకొంది. స్ప్రేయర్లు సకాలంలో అందక పురుగుల మందులు పిచికారీ చేయకపోవడంతో పంటల దిగుబడి బాగా తగ్గింది. ముఖ్యమైన జింకు, జిప్సమ్, సూక్ష్మపోషకాలు ఇవ్వకుండా ఆర్బీకేల పేరుతో కాలం వెళ్లదీశారని ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. వ్యక్తిగతంగా రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందించే ఏర్పాట్లు చేస్తుండటంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ యంత్ర పరికరాలు సంఘాలకు మాత్రమే అందించామన్నారు. వ్యక్తిగతంగా యంత్ర పరికరాలు అయిదేళ్లలో అందించలేమన్నారు.

పశుగణన పక్కాగా నిర్వహించండి

విడవలూరు, న్యూస్‌టుడే: మండలంలో పశుగణన సర్వే పక్కాగా నిర్వహించాలని ఆ శాఖ ఏడీ కృష్ణమౌర్య సూచించారు. విడవలూరులోని పశువైద్యశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు దస్త్రాలు తనిఖీ చేశారు. నంతరం పశుగణనకు సంబధించిన గోడపత్రికలు, సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పొదలకూరు : అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి గ్రామాల్లో నమోదు చేస్తామని పొదలకూరు పశుసంవర్ధకశాఖ ఏడీ అరుణ అన్నారు. 28 వరకు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, కుక్కలు ఇతర జంతుల వివరాలు తమ వద్దకు వచ్చే పశుగణకులకు తెలియ చేయాలని రైతులను కోరారు.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న నగర డీఎస్పీ

నెల్లూరు(నేర విభాగం): ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్లలో జరిగే కౌన్సెలింగ్‌కు కచ్చితంగా షీట్లు ఉన్న వారు హాజరయ్యేలా చూడాలని.. వారిపై నిఘా ఏర్పాటు చేయాలని నగర డీఎస్పీ డి. శ్రీనివాస రెడ్డి సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నగరంలో రౌడీ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని.. వారిపై నిఘా పెంచాలని సూచించారు. నేరాల నియంత్రణకు రాత్రి పూట గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. దీపావళి నేపథ్యంలో అక్రమ టపాసుల గోదాములను గుర్తించాలన్నారు. ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్ బాషా, మద్ది శ్రీనివాస రావు, రోశయ్య, ఆర్ఎస్ఐ కిషోర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన విగ్రహాలకు అభిషేకాలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: పప్పులవీధిలో పునర్నిర్మించిన శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు శుక్రవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత వేదపండితులు యాగశాల ప్రవేశం చేసి కలశస్థాపన, మండపారాధన, హోమాలు నిర్వహించి విగ్రహాలను తైలాధివాసం, ధాన్యాధివాసం చేశారు. భక్తులు ఉదయం నువ్వులనూనెతో, సాయంత్రం నెయ్యితో విగ్రహాలకు అభిషేకాలు చేశారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. కార్యక్రమ ప్రధానాచార్యులు, కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ ఆస్థాన పండితులు రమేష్‌శర్మ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యాగశాలలో ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

28న ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ నెల్లూరు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమాన్ని ఈనెల 28న జరగనుందని సంస్థ అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అబితాబ్ శుక్ల, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి వల్లూరు సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. గూడూరు గోగినేనిపురంలోని రవి ఇన్సులేటింగ్ కంపెనీలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పంట కాలువ ఆక్రమణ

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు తూర్పు ప్రాంతాల్లో 607 సర్వే నంబరు పంట కాలువను వైకాపా నాయకులు ఆక్రమించి నీటిపారుదల లేకుండా పూడ్చేశారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం 13, 15, 16 డివిజన్ల తెదేపా నాయకులతో కలిసి నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రం అందించారు.

దేశ రక్షణపై ఆసక్తి

ప్రభుత్వ పాఠశాలల్లో నావల్ యూనిట్‌లో ప్రత్యేక శిక్షణ

న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట, వేదాయపాలెం)

విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశభక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. నెల్లూరు నగరం సంతపేట పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చిన్నప్పటి నుంచే ఎన్‌సీసీలో అంతర్భాగంగా పదో నావల్ యూనిట్‌ను ప్రారంభించి శిక్షణ ఇస్తున్నారు. అయిదేళ్లుగా దేశ రక్షణపై ఆసక్తి పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ప్రోత్సాహంతో ఎన్‌సీసీ అసోసియేట్ అధికారిగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న పెంచలయ్య ఆధ్వర్యంలో ఎన్‌సీసీలోని ప్రత్యేక నావల్ యూనిట్ మొగ్గతొడిగింది.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఆదర్శభావాలతో అవగాహన: ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో అరవై మందికిపైగా విద్యార్థులు చిన్నప్పటి నుంచే త్రివిధదళాలపై ప్రత్యేక అవగాహన కలిగేలా శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణలో ప్రత్యేకంగా తెల్లటి డ్రస్‌కోడ్ ఉపయోగిస్తున్నారు. ప్రత్యేక వ్యాయామం, ఆయుధ శిక్షణ, విపత్తుల నిర్వహణ, ప్రాథమిక చికిత్స, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, తదితరాలపై శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ

– డి.పెంచలయ్య, ఎన్‌సీసీ నావల్ యూనిట్ అధికారి



అయిదు సంవత్సరాలుగా తమ పాఠశాలలో ఎన్‌సీసీలో నావల్ యూనిట్ శిక్షణ నిర్వహిస్తున్నాం. నెల్లూరు కమాండింగ్ అధికారి ఆదేశాలతో, హెచ్‌ఎం సహకారంతో ఎన్‌సీసీ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నాం. ఇందులో విద్యార్థులకు దేశభక్తి, స్వీయ క్రమశిక్షణతో భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా మావంతుగా కృషి చేస్తున్నాం.

మానసిక వికాసానికి శిక్షణ

– పి.చరణ్‌సాయి, తొమ్మిదో తరగతి



ఎనిమిదో తరగతిలోనే ఎన్‌సీసీ నావల్‌లో చేరా. మా క్యాంపులో మాకు దేహ దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడుతున్న శిక్షణ ఇస్తుండటం ఆనందంగా ఉంది. దేశాన్ని కాపాడే సైన్యంలో రాబోయే తరం కోసం ఇప్పటినుంచే శిక్షణ పొందటం గర్వకారణంగా ఉంది.

విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు

– ఎస్.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు



మా పాఠశాల విద్యార్థులకు చదువుకునే దశ నుంచే దేశభక్తిని, స్వీయ క్రమశిక్షణను అందిస్తున్నాం. ఈ విషయంలో మా పాఠశాల స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి పెంచలయ్య ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. శిక్షణ వల్ల విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు దక్కే అవకాశం ఉంది.

వారం రోజుల్లో అందుబాటులోకి ఎన్టీఆర్ పార్కు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని 19వ డివిజన్, మినీబైపాస్ రోడ్డు ఎన్టీ రామారావు పార్కును నుడా, కార్పొరేషన్ అధికారులతో కలిసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 2014లో తెదేపా అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి మంత్రి నారాయణ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్ చొరవ తీసుకుని పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక పార్కులో కొంత మేర పనులు చేయించినా ప్రజలకు ఉపయోగపడలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత నుడా, కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయించానని తెలిపారు. వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

చెంగాళమ్మ సేవలో అదనపు న్యాయమూర్తి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయానికి శుక్రవారం నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ(పీవోఏ) యాక్ట్ సీయూఎం వీ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎన్.సరస్వతి వచ్చారు. ఆమె అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఈవో ప్రసన్నలక్ష్మి ప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో అదనపు న్యాయమూర్తి

పది రోజులైనా నిర్లక్ష్యమేనా!



నగరంలోని డైకస్ రోడ్డు మధ్యలో భారీగా గుంతలు పడి వర్షపు నీరు చేరింది. పది రోజులుగా ఎటూ వెళ్లలేక రోడ్డు మీదే నిలబడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకలతో గుంతలు గోతులుగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు హెచ్చరిక కోసం బాక్స్‌ను గుంతపై ఉంచారు. ఉన్నతాధికారులు స్పందించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్)

స్తంభం పడిపోయినా.. పట్టించుకోరా?

నగరంలోని మూలాపేట పరిధిలో ఉన్న గొల్లవీధిలో వారం క్రితం బీఎస్ఎన్ఎల్ స్తంభం రోడ్డు మీద పడిపోయింది. స్థానికులు రోడ్డుకు అడ్డం ఉండటంతో తీసి పక్కన పెట్టి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. ఇప్పటికీ దాన్ని అక్కడి నుంచి తొలగించ లేదు. బీఎస్ఎన్ఎల్ అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)



పైపులైనుకు రంధ్రం.. తాగునీరు వృథా

నెల్లూరునగరం మూలాపేట నయా మసీదు ఎదురుగా ప్రధాన రోడ్డుపై తాగునీటి ప్రధాన పైపులైనుకు రంధ్రం పడింది. నాలుగు రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. నీరంతా రోడ్డుపై గుంతల్లో చేరి బురదమయంగా మారుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. అధికారులు స్పందించి తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. మరమ్మతులు చేయిస్తామని నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



జాతీయ స్కేటింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో డాక్టర్స్ కిషోర్స్ రోషిణి రత్నం స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.జస్మిత ప్రతిభ చూపి.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రోలర్ స్కేటింగ్ విభాగంలో కాంస్యం, రింక్-2 విభాగంలో వెండి పతకం సాధించారు. దాంతో జస్మితను విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. జీఎం రామ్మూర్తినాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. మేనేజర్ అజయ్ సింగ్, ప్రిన్సిపల్ మణిమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జస్మితను సన్మానిస్తున్న రత్నం విద్యా సంస్థల జీఎం రామ్మూర్తి నాయుడు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), న్యూస్‌టుడే: జిల్లాలో బాలల సంరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ బి.పద్మావతి తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో బాలల సంరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరాం సతీష్

ఉచితంగా పరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రోబోటిక్ మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేయించుకునే వారికి అవసరమైన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. నగరంలోని అపోలో ఆసుపత్రిలో శుక్రవారం జరిగిన సమావేశంలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్లు డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అతి తక్కువ ఖర్చుతోనే రోబోటిక్ సహాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: ఇందిరమ్మ కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయి.. దోమల బెడద ఎక్కువగా ఉంది. – సరస్వతమ్మ

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? బాలాజీనగర్ మసీదు సెంటరులో కుక్కల సమస్య అధికంగా ఉంది. దాడులు చేస్తున్నాయి. – మస్తాన్

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? అల్లీపురం రోడ్డు మేకలతోట పక్కనే తాగునీటి పైపు వాల్వు నుంచి నీరు వృథాగా పోతోంది. – వెంకటేశ్వర్లు

✓ నీటి వృథాను అరికడతాం.

– సూర్యతేజ, కమిషనర్

? కపాడిపాలెం ప్రధాన మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తాచెదారాలు పేరుకు పోతున్నాయి. అక్కడ చెత్తవేయకుండా ఇంటింటా చెత్త సేకరణ చేయాలి. – రాజ్

✓ చెత్త తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించేందుకు పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఈఈ ఎం.శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో రెవెన్యూ, పోలీస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, బీవీనగర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో మాగుంట లేఅవుట్ 8, 9, 10 వీధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు ఉండదని తెలిపారు.

చిన్నారి రచన.. ప్రతిభకు నిచ్చెన

‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని మూడు పాఠశాలల్లో శుక్రవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అనే అంశంపై జరిగిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో ఎస్‌కే నఫియా సుహాన, ద్వితీయస్థానంలో వీవీ శ్రీవల్లి, తృతీయ స్థానంలో ఎ.సుషల్ కిరణ్ నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ కల్యాణి, మేనేజర్ రాజేష్, ఉపాధ్యాయులు పెంచలయ్య, నాయుడు పాల్గొన్నారు.



కేబీఆర్ స్కూల్లో

నెల్లూరు(ఏసీ నగర్): నగరంలోని భక్తవత్సల నగర్‌లోని కేబీఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహించిన పోటీల్లో ఎం. హేమంత్‌రాజు ప్రథమ స్థానం, కె. మధుసూదన్ ద్వితీయస్థానం, డీవీ జాస్వీక తృతీయస్థానంలో నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ కె.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జె.సతీష్, కె. నాగరాజు, పి.సురేష్ పాల్గొన్నారు.



విజయకృష్ణా స్కూల్లో..

నెల్లూరు(విద్య): నగరంలోని మూలాపేటలో ఉన్న విజయకృష్ణా ఇంగ్లీషు మీడియం స్కూల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో డీఎస్ఆర్ భానుపవిత్ర, ద్వితీయస్థానంలో యూఎస్‌వీ జయంత్, తృతీయస్థానంలో ఎండీ ఇబ్రహీమ్‌ఖాన్ నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ జి.విజయనిర్మల, డైరెక్టర్ ఈ.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవినీతి నిరోధించడంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2024 సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెల్లూరు రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో విజిలెన్స్ వాక్ ‘వాక్‌థాన్’ జరిగింది. ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎ.రాజశేఖరం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. అక్టోబర్ 31న సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతి నిరోధంపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడమే విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ప్రధాన నినాదమన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్‌లు బి.వేణుగోపాల్, బి.శివశంకర్, విజిలెన్స్ ఆఫీసర్ ఎండీ వాజిద్ అహ్మద్, ప్రాంతీయ కార్యాలయం సిబ్బంది, శాఖల బ్రాంచ్ హెడ్‌లు పాల్గొన్నారు.

పంటలు నష్టపోకుండా నివారణ చర్యలు వివరించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇటీవల కురిసిన వర్షాలతో ముంపునకు గురైన పంటలను రైతులు నష్టపోకుండా శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తెలియజేయాలని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తెలిపారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డు కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉమామహేశ్వరి, పీసీపీఎన్‌డీటీ జిల్లా ప్రోగ్రాం అధికారి కె.కనకరత్నం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సీపీఎం రూరల్ మండల కార్యదర్శిగా జనార్దన్

నెల్లూరుగ్రామీణం: సీపీఎం రూరల్ మండల నూతన కార్యవర్గం శుక్రవారం దేవరపాలెంలో జరిగిన పార్టీ మండల మహాసభలో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పూడిపర్తి జనార్దన్, సభ్యులుగా ఎడవల్లి రమణయ్య, ఎగ్గోలు భాస్కర్, అట్లా అనిల్, జానా లక్ష్మీ ప్రసాద్, పర్చూరు ప్రభాకర్, పాదర్తి మస్తానయ్య, గుంటి నాగరాజు, గంప సుధీర్, ఎంవి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

5న కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం నవంబరు 5వ తేదీన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేశారు. అక్టోబరు 22న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించినా.. వాయిదా పడింది. తిరిగి నవంబరు 5న నిర్వహించేందుకు నిర్ణయించారు. కార్పొరేటర్లకు 70 అంశాలతో కూడిన కౌన్సిల్ సమావేశం అజెండా కాపీలను అందించారు.

ఉద్యోగినులకు సౌకర్యాలు కల్పించండి

నెల్లూరు(కలెక్టరేట్): మహిళా ఉద్యోగినులు పని చేసే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు ఎస్.శివకుమారిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఒ.ఆనంద్‌ను కలిసి మహిళా ఉద్యోగులను సమస్యలను వివరించారు.

జనావాసాల్లో మద్యం దుకాణం తగదు

నెల్లూరు(విద్య): మైపాడు రోడ్‌లోని శ్రీనివాస నగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని స్థానిక మహిళలతో కలిసి ఐద్వా నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ.. ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు సరికాదన్నారు. నిత్యం మహిళలు, విద్యార్థులు తిరిగే ప్రాంతమని.. వెంటనే తొలగించాలన్నారు. అధికారులు, పోలీసులు వచ్చి సర్దిచెప్పేందుకు యత్నించారు. దుకాణం ఎత్తివేయకుండా నిరసన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శి పద్మ, నాయకులు శివకుమారి, రెహానమ్మ, సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం): గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మాగుంట లేఅవుట్ బ్రిడ్జి వద్ద జరిగింది. మృతుడు 55 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగి ఉండి తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, ఎరుపు, పసుపు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: భార్యను అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో భర్త, అత్తింటివారిపై వేదాయపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నేతాజీ నగర్‌కు చెందిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉచిత ఇసుక పేరుతో మోసం



కలెక్టరేట్ వద్ద వైకాపా నాయకులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేయడాన్ని నిరసిస్తూ నెల్లూరు జిల్లా వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. శుక్రవారం వీఆర్సీ సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉచిత ఇసుక అందించాలంటూ నినాదాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళీ, మాజీ ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సంజీవయ్య, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, కందుకూరు ఇన్‌ఛార్జి మధుసూదన్‌యాదవ్, ఉదయగిరి ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.